సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

సోమవారం । 20 । ఫిబ్రవరి । 2023



భక్తుల కొంగుబంగారం గంగమ్మ తల్లి

చింతకొమ్మదిన్నె గంగమ్మ తల్లి జాతర ఈ నెల 21,22న నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్, ఈఓ తెలిపారు. - 8లో



కావ్య సాహిత్య ప్రతిష్టను పెంచిన 'భూతపురి'

డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ తన రచనలతో కావ్య సాహిత్య ప్రతిష్టను పెంచారని వైవీయూ ఉప కులపతి అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
34.8/19.8

వాతావరణం

జిల్లాలో ఆదివారం 19.8 – 34.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

24న కలెక్టరేట్ ఎదుట ధర్నా

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ ఈ నెల 24న సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023–24 కేంద్ర వార్షిక బడ్జెట్‌లో ఔషధాలపై, ఆహార ధాన్యాలపై, నిత్యావసర వస్తువులపై పెంచిన జీఎస్టీని వెంటనే ఉపసహరించుకోవాలన్నారు. 1952 నుండి పేదలకు దేశంలో ఇస్తున్న 5 కేజీల ఉచిత ఆహార ధాన్యాన్ని, రేషన్ కార్డుకు సబ్సిడీ ఆహార ధాన్యాలను మోడీ ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ఆపేయడం దారుణమన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీ రేట్లు పెంచి అధిక నిధులను పెంచి కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామ్మోహన్, దస్తగిరి రెడ్డి, చంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలలో సహకారానికి కృతజ్ఞతలు

కడప కల్చరల్ : జిల్లా వ్యాప్తంగా జరిగిన మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన వారందరికీ దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో శివరాత్రి ఉత్సవాలకు లక్షలాది మంది జనం వస్తారు కనుక అధికారులంతా దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహించారన్నారు. వారి సహకారంతోనే తమ శాఖ వీటిని విజయవంతం చేయగలిగిందని తెలిపారు. కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌ల మార్గదర్శకత్వంలో రెవెన్యూ, పోలీసు, విపత్తుల నిర్వహణ, పంచాయతీ, వైద్య ఆరోగ్యశాఖలతోపాటు ఇతర అన్నిశాఖల అధికారులు, సిబ్బందికి తమ శాఖ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

22న ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి నామినేషన్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి

కడప ఎడ్యుకేషన్: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎంవీ రామచంద్రారెడ్డి నామినేషన్ కార్యక్రమాన్ని ఈ నెల 22న నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆదివారం కడపలోని ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి కార్యాలయంలో ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రామచంద్రారెడ్డిని ప్రథమ ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కోరారు. ప్రగతిశీల ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, రాష్ట్ర ఆర్థిక కారదర్శి ఇలియాస్‌రెడ్డి, కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్‌రెడ్డి, కస్తూర్బా అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు అరుణమ్మ, గెస్టు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గురురత్నం, డిగ్రీ కాలేజ్ అధ్యాపకుల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగభూషన్‌రెడ్డి, విజయ్‌కుమార్‌లు మాట్లాడారు.

హరిప్రియ ఎక్స్‌ప్రెస్‌కు స్టేషన్‌ల కుదింపు

కడప కోటిరెడ్డి సర్కిల్: లోండా, గుంజి స్టేషన్‌ల మధ్య జరుగుతున్న డబ్లింగ్ పనుల కారణంగా హరిప్రియ ఎక్స్‌ప్రెస్ రైలు మార్గాన్ని 5 రోజులపాటు కుదించినట్లు కడప రైల్వే స్టేషన్ మేనేజర్ డి.ఎస్. రెడ్డి, కడప రైల్వే చీఫ్ టికెట్ ఇన్స్‌పెక్టర్ ఉమర్‌బాషాలు తెలిపారు. తిరుపతి–కొల్హాపూర్ మధ్య నడుస్తున్న హరిప్రియ ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 21 నుంచి 25 వరకు తిరుపతి– ధార్వాడ వరకు మాత్రమే నడుపనున్నారన్నారు. ఈ రైలు తిరుగు ప్రయాణంలో 22 నుంచి 26 వరకు ధార్వాడ నుంచి తిరుపతి వరకు మాత్రమే నడుస్తుందన్నారు. ప్రయాణికులు ఈ విషయం గమనించాలని వారు కోరారు.

నిత్యపూజ స్వామి హుండీ ఆదాయం రూ.11,95,210

సిద్దవటం: మండలంలోని వంతాటిపల్లె గ్రామ సమీపంలోని లంకమల్ల అడవుల్లో వెలసిన నిత్య పూజస్వామి హుండీ ఆదాయం రూ. 11, 95, 210 వచ్చిందని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. నవంబర్ 25వ తేదీ 2022 నుంచి ఫిబ్రవరి 19వతేదీ 2023 వరకు భక్తులు స్వామి వారి హుండీలో వేసిన కానుకలను దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులు, పోలీసుల సమక్షంలో శనివారం అర్ధరాత్రి లెక్కించామన్నారు. హుండీ ఆదాయం రూ. 11,95, 210 వచ్చిందన్నారు. కల్యాణం చదివింపుల ద్వారా వచ్చిన నగదు రూ. 5,556 కాగా, లడ్డు వేలం పాట ద్వారా వచ్చిన నగదు రూ. 10 వేలు, హుండీ ద్వారా బంగారం , వెండి కూడా వచ్చిందన్నారు. ఆలయ చైర్మన్ పి. కొండారెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కష్టాలను ఓడించిన సుధీరుడు!

- నాటి పేపర్ బాయ్.. నేడు అమెరికాలో సైంటిస్టు
- ఢిల్లీ ఎయిమ్స్‌లో హెచ్‌ఐవీపై పరిశోధనకు పీహెచ్‌డీ
- పిట్స్‌బర్గ్ వర్సిటీ, ఎస్‌పీఆర్‌ఐలో పరిశోధనలు
- మూడు పేటెంట్ హక్కులు కైవసం
- ప్రముఖ పరిశోధన సంస్థలు, సైంటిఫిక్ జర్నల్స్‌లో సభ్యత్వం
- స్వశక్తితో ఎదిగి నేటి యువతకు స్ఫూర్తి



పరిశోధనల్లో డాక్టర్ రావూరి సుధీర్‌కుమార్



అమెరికాకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ జానీ హువర్డ్‌తో సుధీర్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్: కన్నవారు దూరమైన దుర్భర బాల్యం. ఇతరుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బతకాల్సిన దైన్యం. అవమానాలు, ఆటంకాలు, మరెన్నో ప్రతిబంధకాలు. కష్టాలన్నీ కట్టకట్టుకు వచ్చినా ఆయన పట్టుదల, పరిశ్రమ ముందు అవి తలవంచక తప్పలేదు. బాల్యంలోనే ఎన్నో సవాళ్లను చెరగని చిరునవ్వుతో ఎదుర్కొన్నారు. ఒకప్పుడు వీధుల్లో పేపర్ బాయ్‌గా తిరిగిన ఓ యువకుడు అంచెలంచెలుగా ఎదిగి నేడు అమెరికాలో మంచి సైంటిస్టుగా రాణిస్తున్నారు. ప్రస్తుతం ''సెంటర్ ఫర్ రీ జనరేటివ్ స్పోర్ట్స్ మెడిసిన్'' డిప్యూటీ డైరెక్టర్‌గా మల్టీ డిసిప్లినరి రీసెర్చి ప్రాజెక్ట్స్ చేస్తున్నారు. ఎన్నో అద్భుత విజయాలు తన ఖాతాలో వేసుకుని నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న కడప నాగరాజుపేటకు చెందిన ఆయన పేరు డాక్టర్ రావూరి సుధీర్‌కుమార్.

బాల్యం గడిచిందిలా!

పసితనంలోనే తల్లిదండ్రులు దూరం కావడంతో అవ్వ చల్లా కమలమ్మ అక్కున చేర్చుకుంది. ఐదవ తరగతి వరకు నాగరాజుపేట గుండాచారి బడిలో చదువుకున్నారు. విశ్రాంత ఉపాధ్యాయురాలైన అవ్వ కమలమ్మకు చదువు విలువ ఏమిటో బాగా తెలుసు. చదువే నిజమైన ఆస్తి అంటూ మనవడికి తరచూ నూరిపోసేది. అవ్వ మాటలు ఆయనను ఎంతో ప్రభావితం చేశాయి. గుంతకల్లు, గుత్తిలో పిన్ని ఇంట హైస్కూలు విద్యాభ్యాసం సాగింది.

సైన్స్ పట్ల జిజ్ఞాస

గుత్తి రైల్వే ఇంగ్లీషు మీడియం హైస్కూలులో తొమ్మిదో తరగతి చదువుతున్నప్పుడు ఆకుల నుంచి విద్యుత్ తయారవుతుందని 'ఎలక్ట్రానిక్స్ ఫర్ యూ' అనే పత్రికలో చదివాడు. అందుకు జిల్లేడు, బొంత జెముడు ఆకులు పనికి వస్తాయని సుధీర్ కనుగొన్నారు. ఇలా ఆయన బయో లాజికల్ బ్యాటరీ తయారు చేశాడు. అప్పట్లో హైదరాబాదులో జరిగిన సైన్స్ ఫెయిర్‌లో రాష్ట్రపతి వెంకట్రామన్ నుంచి సర్టిఫికెట్ అందుకున్నారు. సిమ్లాలో జరిగిన ఇంటర్ స్టేట్ సైన్స్ ఫెయిర్‌కు ఈ ప్రయోగం ఎంపికై ంది. ఇంటర్మీడియేట్ కడప సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో, 1994–97లో ఆర్ట్స్ కళాశాలలో బీఎస్సీ పూర్తి చేశాడు. తాను ఇంకొకరికి భారం కారాదని భావించి పేపర్ బాయ్‌గా, వీడియో కెమెరామెన్‌గా కొన్నాళ్లు పనిచేశారు. గ్రూప్–4, బ్యాంకు పరీక్షలు రాశారు. బీఈడీలో ఉచిత సీటు వచ్చింది. సైంటిస్టు కావాలన్న బలమైన ఆకాంక్ష వల్ల వాటిని వదులుకున్నారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ వైరాలజీ ప్రవేశానికి కిశోర్ అనే స్నేహితుడు రూ. 400 సాయం చేసి దరఖాస్తు చేయించగా సీటు వచ్చింది. తిరుపతిలో ఉన్న మరో పిన్ని ఇంటిలో ఉంటూ చదువు కొనసాగించారు. తన ఖర్చులు తాను సంపాదించుకోవాలని ప్రైవేటు డిగ్రీ కళాశాలలో పార్ట్ టైం అధ్యాకునిగా పని చేశారు. ఖర్చులు తగ్గించుకోవడంలో భాగంగా తన జుట్టు తానే కట్ చేసుకోవడం నేర్చుకున్న ఆయన ఒక సెలూన్ కూడా ప్రారంభించాలని భావించారు. వెటర్నరీ వైరాలజీ పైన ఎమ్మెస్సీ ప్రాజెక్టు వర్క్‌ను తిరుపతిలో చేశారు. 1999లో ఎమ్మెస్సీ పూర్తయ్యాక అక్కడి కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్‌లో ఐసీఏఆర్–ఐఏఆర్‌టీ ఫెలోషిప్ జాబ్ చేశారు. జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకులో ఉన్న బెంగళూరులోని ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఐఐఎస్‌సీ)లో మోనోక్లోనల్ యాంటీ బాడీస్‌పై పనిచేశారు. వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌లో డయాగ్నస్టిక్స్ చేశారు. ఈ సమయంలో రెడ్డీస్ ల్యాబ్‌లో ఉద్యోగం వచ్చింది. అయితే అదే సమయంలో ఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో హెచ్‌ఐవీ–1పై పనిచేసే అవకాశం తలుపు తట్టగా, దాన్నే ఎంచుకున్నారు. దీంతో ఆయన జీవితం పెద్ద మలుపు తిరిగింది. హెచ్‌ఐవీ సోకిన వ్యక్తిలో రోగ నిరోధకశక్తి తగ్గిపోయి త్వరగా మరణానికి చేరువవుతాడు. అలాంటి వ్యక్తుల్లో వచ్చిన జన్యుపరమైన మార్పులను గుర్తించి దానికి తగ్గట్టు కాంబినేషన్ మందుల్లో ఎలాంటి మార్పులు చేయాలన్న అంశంపై పరిశోధన చేశారు. ఆయనకు 2006లో పీహెచ్‌డీతోపాటు పేటెంట్ హక్కులు లభించాయి.

అమెరికాలో పరిశోధనలు

సుధీర్ అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రంలోగల పిట్స్‌బర్గ్ యూనివర్సిటీకి పోస్టు డాక్టోరల్ ఫెలోషిప్‌పై వెళ్లారు. మెంటార్‌గా కూడా పనిచేశారు. రీసెర్చి అసోసియేట్‌గా తొమ్మిదేళ్ల పిట్స్‌బర్గ్‌లో ఉన్నారు. నిర్వీర్యం చేసిన హెచ్‌ఐవీ వైరస్‌లోకి ఉపయోగకరమైన జన్యువులను పంపి తద్వారా వచ్చిన నిర్వీర్య వైరస్‌ను మూల కణాల ఉత్పత్తి, రొమ్ము క్యాన్సర్ నిరోధానికి ఉపయోగించడంపై పరిశోధన చేశారు. కొలరాడోలోని స్టెడ్‌మన్ ఫిలిప్పన్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ (ఎస్‌పీఆర్‌ఐ)లో 'వార్ధక్య దశకు చెందిన కణాలను గుర్తించి నిర్మూలించడం ద్వారా మెరుగైన వృద్ధాప్య జీవితం' అనే అంశంపై పరిశోధన చేశారు. అక్కడి ప్రసిద్ధ శాస్త్రవేత్తలతో కలిసి జీన్ థెరపీ, స్టెమ్‌సెల్ బయాలజీ, టిష్యూ ఇంజినీరింగ్ అంశాల్లో పనిచేశారు. అమెరికా ప్రభుత్వానికి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్, డిపార్టుమెంటు ఆఫ్ డిఫెన్స్, యూఎస్ ఒలంపిక్ అండ్ పారాలింపిక్ నేషనల్ మెడికల్ సెంటర్‌లో పరిశోధనలు చేశారు.

గ్రాంట్ అవార్డ్స్

ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్‌గా ప్లాస్టిక్ సర్జరీ ఫౌండేషన్ గ్రాంటు, కో ఇన్వెస్టిగేటర్‌గా ఎన్‌ఐహెచ్, డీఓడీ ప్రభుత్వ గ్రాంటు, కో ప్రిన్సిపల్ సైంటిస్టుగా ప్రైవేటు ఇండస్ట్రీ ఫండింగ్ లభించాయి. ఎడిటోరియల్ బోర్డు మెంబర్, గెస్ట్ ఎడిటర్, సైంటిఫిక్ రివ్యూవర్‌గా పలు అంతర్జాతీయ రీసెర్చి జనరల్స్‌లో పనిచేశారు. పలు సైంటిఫిక్ సమ్మిట్స్‌కు చైర్ పర్సన్, కో చైర్ పర్సన్‌గా వ్యవహరించారు. కొలరాడో స్టేట్ యూనివర్సిటీలో అఫిలియేట్ సైంటిస్టుగా నియమితులయ్యారు. కండరాల్లో మూల కణాలు కనుగొన్న ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ జానీ హువర్డ్‌తో కలిసి ప్రస్తుతం సెంటర్ ఫర్ రీ జనరేటివ్ స్పోర్ట్స్ మెడిసిన్ (సీఆర్ఎస్ఎం)లో మల్టీ డిసిప్లినరీ రీసెర్చి ప్రాజెక్టులు నిర్వహిస్తున్నారు.

ఆకాంక్షతోపాటు నిరంతర కృషి అవసరం



ఏ రంగంలోనైనా ఉన్నత స్థాయికి వెళ్లాలన్న ఆకాంక్ష ఒక్కటే ఉంటే సరిపోదు. అందుకు తగ్గట్టు నిరంతర కృషి ఉన్నప్పుడే లక్ష్యాన్ని అందుకోగలమని విద్యార్థులు గుర్తించాలి. నిరుత్సాహ పడకుండా అవకాశాలు వచ్చేంత వరకు ఓపిక అవసరం. ఒకప్పుడు ఏమీ లేని నేను ఇప్పుడు ఒక స్థాయిలో ఉన్నానంటే అది మా అవ్వ కమలమ్మ, మా ఇద్దరు పిన తల్లులతోపాటు స్నేహితులు కిశోర్, ప్రసాద్, రాజు, మేనమామ చల్లా రాజేంద్ర వరప్రసాద్ (సీఆర్‌వీ ప్రసాద్), టీచర్లు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు ఇచ్చిన సహకారమే కారణం.

– డాక్టర్ రావూరి సుధీర్‌కుమార్, నాగరాజుపేట, కడప

ప్రశాంతంగా ఎస్.ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్ష



పరీక్ష రాసేందుకు వచ్చి క్యూలో నిలుచున్న అభ్యర్థులు



కడపలోని మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

- 11 పరీక్షా కేంద్రాల్లో పకడ్బందీగా నిర్వహణ
- జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్: జిల్లాలో ఎస్.ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించారు. ఆదివారం కడప నగరంలోని కోటిరెడ్డి మహిళా కళాశాలలో జరుగుతున్న ఎస్.ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ రాత పరీక్షల నిర్వహణ తీరును జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎస్ఐ ఉద్యోగాల ప్రాథమిక పరీక్షల నిర్వహణ విషయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. జిల్లాలోని అభ్యర్థులకు కడపలో 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షలకు 9540 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. అన్ని పరీక్షా కేంద్రాలు, రూట్లను సమన్వయం చేసుకుని ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు డీఎస్పీల నేతృత్వంలో పర్యవేక్షించామన్నారు. మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్ జరగకుండా ఈ బృందాలు పర్యవేక్షించాయన్నారు. పరీక్షా కేంద్రాల వెలుపల 144 సెక్షన్ అమలులో పెట్టామన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాలలో జిరాక్స్ సెంటర్లను మూసివేయించామన్నారు. ప్రశాంతంగా, సజావుగా పరీక్షలు నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కడప డీఎస్పీ బి. వెంకట శివారెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

8335 మంది హాజరు

ఎస్.ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్షకు జిల్లా నుంచి 9540 మంది అభ్యర్థులకుగాను, 8335 మంది హాజరయ్యారు. దాదాపు 87.4 శాతం మంది అభ్యర్థులు జిల్లాలో హాజరయ్యారని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. 1205మంది గైర్హాజరయ్యారు. పరీక్షకు హాజరైన వారిలో 6991 మంది పురుష అభ్యర్థులు కాగా, 1344 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు.

నాయీ బ్రాహ్మణ కృతజ్ఞతా సభను విజయవంతం చేయాలి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్ బాబు

కడప కార్పొరేషన్: ఈనెల 28వ తేది విజయవాడలోని తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించనున్న నాయీ బ్రాహ్మణ కృతజ్ఞతా సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు, మాజీ మంత్రి పి. రామసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అపూర్వ కళ్యాణ మండపంలో కృతజ్ఞతాసభ కరపత్రాలను విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడిన కులాలు సమాజానికి వెన్నెముక వంటివారని నిరూపిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. సేవకులుగా ఉన్న నాయీ బ్రాహ్మణులను పాలకులుగా చేస్తూ దేవాలయాల పాలకమండళ్లలో స్థానం కల్పించారన్నారు. ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్దవటం యానాదయ్య మాట్లాడుతూ వైఎస్ జగన్ సీఎం అయ్యాక రాష్ట్ర వ్యాప్తంగా వందలాదిమంది బీసీలకు నామినేటెడ్ పదవులు ఇచ్చారన్నారు. సీఎంకు కృతజ్ఞతలు తెలిపేందుకు ఈ సభ నిర్వహిస్తున్నామన్నారు. నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. గుర్రప్ప, యువజన అధ్యక్షుడు కె. బాబు, నాయకులు కిషోర్, రామకృష్ణ, ప్రసాద్, వెంకటేష్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్ బాబు, మాజీ మంత్రి రామసుబ్బారెడ్డి

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు వేళాయె!

- నేటి నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు
- ఈ నెల 20 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు
- ఈ ఏడాది కూడా నాన్ జంబ్లింగ్ విధానం అమలు
- ఒకేషనల్‌కు 30 , జనరల్‌కు 101 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- హాజరు కానున్న 14,541 మంది విద్యార్థులు



ప్రాక్టికల్స్‌కు సిద్ధం చేసిన పరికరాలు

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 20వ తేదీ నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఈ ఏడాది కూడా ఇంటర్ ప్రాక్టికల్స్‌ను నాన్‌జంబ్లింగ్ విధానంలో నిర్వహించనున్నారు. దీంతో సెల్ఫ్ సెంటర్లు పరీక్షా కేంద్రాలు కావడంతో అన్ని పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రాక్టికల్స్‌కు ఒకేషనల్, జనరల్ విద్యార్థులు హాజర కానున్నారు. ఇందులో ఒకేషనల్‌కు సంబంధించిన ప్రాక్టికల్స్ ఈ నెల 20వ తేదీ నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు జరగనుండగా జనరల్ ప్రాక్టికల్స్ ఈ నెల 26వ తేదీ నుంచి మార్చి 7వ తేదీ వరకు జరగనున్నాయి. జనరల్ ప్రాక్టికల్స్‌ను రెండు విడతల్లో నిర్వహించనున్నారు. ఇందులో మొదటి విడత ఈనెల 26వ తేదీ నుంచి 2వ తేదీ వరకు, రెండవ విడత మార్చి 3వ తేదీ నుంచి మార్చి 7వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక విడత, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మరో విడత ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి.

జిల్లాలో 14,541 మందికి ప్రాక్టికల్ పరీక్షలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్స్ పరీక్షలకు 14,541 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో ఒకేషనల్‌కు సంబంధించి ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి 3670 మంది, జనరల్‌కు సంబంధించి 10,871 మంది ద్వితీయ ఇంటర్ విద్యార్థులు హాజరుకానున్నారు. ఒకేషనల్ విద్యార్థులకు 30 సెంటర్లలో, జనరల్ విద్యార్థులకు 101 సెంటర్లలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రైవేటు కళాశాలలకు సంబంధించి ల్యాబ్ సౌకర్యం సరిగా లేకపోయినా, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న కళాశాలల విద్యార్థులను దగ్గరలోని ప్రభుత్వ కళాశాలలకు అటాచ్ చేసినట్లు ఇంటర్ అధికారులు తెలిపారు. అలాగే కడపలో కొన్ని కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఎ,బి పరీక్షా కేంద్రాలను కూడా ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.

హాల్ టికెట్‌కు టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు

ఇంటర్ బోర్డు అధికారులు ఈ ఏడాది హాల్‌టికెట్‌కు టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేశారు. అటెండెన్స్ నిబంధనల ప్రకారం విద్యార్థులందరికి ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ హాల్ టికెట్ ఇవ్వాలని ఇంటర్‌బోర్డు సూచించింది. దీనికి భిన్నంగా ఎవరైనా వ్యవహరిస్తే చర్యలు చాలా కఠినంగా ఉండనున్నాయి. జిల్లాలో కొన్ని కార్పొరేట్, ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించలేదని లింక్ పెట్టి విద్యార్థులకు హాల్‌టికెట్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎవరికై నా హాల్‌టికెట్ ఇవ్వకుండా ఇబ్బందులు పెడితే వారు వెంటనే 1800 4257635 నంబర్‌కు ఫిర్యాదు చేస్తే సమస్యను పరిష్కరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నంబర్‌తోపాటు జిల్లాలో 08562–244171 నంబర్‌ను ఏర్పాటు చేశారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు

ప్రాక్టికల్స్‌ను నిర్వహించే ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని ప్రతి పరీక్షా కేంద్రాన్ని ఆర్ఐఓ కార్యాలయం, ఇంటర్‌బోర్డుకు అనుసంధానం చేశారు.

పరీక్ష వేళలు

ఉదయం బ్యాచ్: ఉదయం 9 నుంచి 12 గంటల వరకు

మధ్యాహ్నం బ్యాచ్: మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు

అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశాం



ఇంటర్ ప్రాక్టికల్స్ కోసం అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశాం. ప్రతి పరీక్షా కేంద్రం లోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాము. ప్రాక్టికల్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అరగంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. ప్రాక్టికల్స్ నిర్వహణలో ఎవరైనా అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలి.

– రమణరాజు, ఇంటర్మీడియట్ ఆర్ఐఓ. కడప.

పొలతలలో ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు

పెండ్లిమర్రి: పొలతల శైవ క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమై ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చి మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాముల వారిని దర్శించుకుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఈఓ మహేశ్వర్‌రెడ్డిలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మంగళవారం రాత్రి స్వామివారి రథోత్సవం మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి నిర్వహించనున్నారు.

పోలీసుల సేవలు భేష్: పొలతల క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, అసాంఘిక కార్యకలాపాలు, ప్రమాదాలకు తావివ్వకుండా పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ కే.కే.ఎన్ అన్బురాజన్ పర్యవేక్షణలో డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ అశోక్‌రెడ్డి, ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డిల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

తాత్కాలిక హుండీ కానుకలు లెక్కింపు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పొలతల క్షేత్రంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన హుండీలను ఆదివారం ఉత్సవాల ప్రత్యేకాధికారి ముకుందారెడ్డి, ఆలయ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఈఓ మహేశ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో లెక్కించారు. మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాములవారి వద్ద ఉన్న తాత్కాలిక హుండీలను లెక్కించగా రూ.11,20,527 లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా రూ.3,92,500, అంగడి బాడుగల ద్వారా రూ.44,000 లభించిందన్నారు.



హుండీ కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

క్లుప్తంగా

ఆటో, బైక్ ఢీ: యువకుడి మృతి



పెంచలయ్య మృతదేహం

చక్రాయపేట: మండలంలోని సురభి గ్రామం ఊటుకూరువాండ్లపల్లె సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వేంపల్లె పట్టణం రాజారెడ్డి నగర్‌కు చెందిన పెంచలయ్య (35) మృతి చెందినట్లు ఎస్సై మల్లికార్జునరెడ్డి తెలిపారు.వేంపల్లెకు చెందిన ఆటో లక్కిరెడ్డిపల్లెకు వెళ్లి తిరిగి వస్తోంది. ఇదే సమయంలో వేంపల్లె నుంచి లక్కిరెడ్డిపల్లె వైపు బైక్‌లో వెళుతున్న పెంచలయ్య ఊటుకూరు వాండ్లపల్లె వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్నాడు.దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో, స్కూటర్ దెబ్బతిన్నాయి. సంఘటనపై మృతుడి బంధువులకు సమాచారం చేరవేసినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదుచేసినట్లు చెప్పారు.

రైలు కిందపడి..



సురేష్‌బాబు (ఫైల్)

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప–భాకరాపేట స్టేషన్ల మధ్య దిగువ రైలు పట్టాలపై ఆదివారం గూడ్స్ కింద పడి గానుగపెంట సురేష్‌బాబు (24) మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ రారాజు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. బద్వేలుకు చెందిన గానుగపెంట సురేష్‌బాబు ఆదివారం మధ్యాహ్నం బిర్యానీ తిని వస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. తర్వాత సురేష్‌బాబు సోదరుడు సుధీర్‌కుమార్ ఇతరులు ఫోన్ చేసి సురేష్ బాబు రైలు కిందపడి చనిపోతున్నాడని సమాచారం ఇచ్చారన్నారు. మృతికి సంబంధించిన కారణాలు విచారిస్తున్నామని ఎస్ఐ వివరించారు. మృతదేహాన్నికడప రిమ్స్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

పొలతలలో గుండెపోటుతో మహిళ..

పెండ్లిమర్రి : వైఎస్సార్ జిల్లా పొలతల క్షేత్రంలో ఆదివారం కర్నూలు జిల్లా బేతంచర్లకు చెందిన చాకలి లక్ష్మీదేవి(57) గుండెపోటుతో మృతి చెందింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు..లక్ష్మీదేవి మల్లేశ్వరస్వామిని దర్శించుకుని కుర్చొని ఉండగా అస్మాత్తుగా గుండెపోటుకు గురై అక్కడికక్కడే క్రిందపడి చనిపోయింది. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలిచడానికి పెండ్లిమర్రి తహసీల్దార్ ఉదయభాస్కర్ రాజు అంబులెన్స్ పిలిపించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.15వేలు అర్థిక సహాయం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డి తెలిపారు.

27 మంది జూదరుల అరెస్ట్

చింతకొమ్మదిన్నె : కడప నగర పరిధిలోని ఇందిరా నగర్ సమీపంలో జూదమాడుతున్న 27 మందిని అరెస్ట్ చేసినట్లు సీకె దిన్నె ఎస్ఐ బి. అరుణ్ రెడ్డి ఆదివారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.98,700 స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

భక్తుల కొంగుబంగారం గంగమ్మ తల్లి



ఆలయంలో వెలసిన గంగమ్మ తల్లి మూలవిరాట్



అమ్మవారి ఆలయం

- 21న అమ్మవారి కళ్యాణం
- 22న జాతర

చింతకొమ్మదిన్నె : జిల్లాలో ప్రసిద్ధి చెందిన చింతకొమ్మదిన్నె గంగమ్మ తల్లి జాతర ఈ నెల 21,22న నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ బీపీ విశ్వనాథరెడ్డి ,ఈవో సురేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. 21న నిండు తిరునాల, అదే రోజు రాత్రికి అమ్మవారి కల్యాణం జరుగుతుంది.22న మైల తిరునాల జరుగుతుందని తెలిపారు.

అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

జాతర సందర్భంగా గంగమ్మ తల్లికి ఆడబిడ్డ సాంగ్యాన్ని పూర్వం నుంచి చింతకొమ్మదిన్నె గ్రామం నుంచి తీసుకురావడం ఆనవాయితీగా ఉంది. ఆలయ చైర్మన్ బీపీ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలతో ఆలయం వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి లక్కిరెడ్డిపల్లి గ్రామంలో ఉన్న ఉత్సవ విగ్రహాలను అలంకరించుకుని బాణా సంచాపేలుస్తూ, వాయిద్యాల మధ్య అమ్మవారు ఆలయానికి చేరుకుంటారు. అదే రోజు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి జంతుబలి చేస్తారు. జాతర సందర్భంగా ఆలయంలో 20వ తేదీ రాత్రి సిద్దల కూడు పంపిణీ కార్యక్రమాన్ని చేపడాతారు. ఈ సిద్దల కూడు తీసుకుంటే పెళ్లి కాని యువతీ, యువకులకు పెళ్లి, సంతానం లేని వారికి సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. మహాశివరాత్రి ముగిన రెండు రోజుల తర్వాత అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారి కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఆలయ ఈవో సురేష్ కుమార్‌రెడ్డి, చైర్మన్ విశ్వనాథరెడ్డి ముత్యాల తలంబ్రాలు, గాజులు అందిస్తారు. 22న మైల తిరునాలతో జాతర ముగుస్తుంది.

■ అమ్మవారి జాతర ముగిసిన తర్వాత వచ్చే నాలుగు ఆదివారాల పాటు అమ్మవారికి వారాల తిరునాలను నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీ. ఇందులో భాగంగా ఈ నెల 26న మొదటి వారం, మార్చి 05న రెండో వారం, 12న మూడో వారం, 19న నాలుగో వారం తిరునాల జరగనుంది.

దాతల సహకారంతో అభివృద్ధి

దాతల సహకారంతో ఆలయంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఆలయానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేని సమయంలో రిటైర్డ్ వీఆర్‌వో వై.రాచంద్రయ్య తన సొంత భూమిని అందించి కడప–రాయచోటి ప్రధాన రహదారిపై ప్రధాన ముఖద్వారాన్ని నిర్మించారు. ఆలయంలో భక్తుల సౌకర్యార్థం విడిది గదులు, మంచి ట్యాంకర్లు, మంచి నీటి బోర్లను దాతలు ఏర్పాటు చేశారు. ఏపీ టూరిజం ఆధ్వర్యంలో కల్యాణ మండపం, భోజన శాలను నిర్మించారు.జాతర సందర్భంగా ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అందంగా అలంకరించారు.



విద్యుత్ దీపాలంకరణలో గంగమ్మ ఆలయం

ఏర్పాట్లు పూర్తి చేశాం

గంగమ్మ తిరునాలకు ఏర్పాట్ల పూర్తి చేశాం. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. వైద్య సదుపాయం ఏర్పాటు చేశాం.

–పి.సురేష్ కుమార్‌రెడ్డి, గంగమ్మ తల్లి ఆలయ ఈవో

కాలజ్ఞానంపై విస్తృత చర్చజరగాలి



బ్రహ్మంగారి జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మఠం అధికారులు, పూర్వపు మఠాధిపతుల కుమారులు

బ్రహ్మంగారిమఠం : జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానంపై విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి సంక్షిప్త జీవిత చరిత్ర, కాలజ్ఞానం, మఠాధిపతుల పరంపర, వంశవృక్షం కాల నిర్ణయ పట్టిక, వ్యక్తిగత విశిష్ట సేవలపై శనగపాటి బ్రహ్మానందం రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మఠం ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి చెప్పిన ఎన్నో విషయాలు జరిగాయని, జరగబోతున్నాయని, అందువల్ల వాటిపై చర్చ జరగాలని అన్నారు. వాటిని ముందే గ్రహించి నివారణోపాయాలను కనిపెట్టాలని చెప్పారు. అలాగే మానవులు సత్‌ప్రవర్తనతో మెలగాలని కోరారు. రచయిత ఎన్నో వ్యయప్రయాసల కోర్చి రచించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మఠం మేనేజర్ శ్రీ ఈశ్వరాచారి, పూర్వపు మఠాధిపతుల కుమారులు శ్రీ వెంకటాద్రిస్వామి, శ్రీ వీరభద్రస్వామి, వీరంభట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి, వరదరాజస్వామి దివంగత మఠాధిపతి సోదరులు వీరభద్రస్వామి, ఆలయ ఆధ్యాత్మిక ఆధ్వర్యులు ఇడమకంటి జనార్ధన శివాచార్య, పడగండ్ల వెంకటాచార్యులు, రామబ్రహ్మం, సింగర్రెడ్డి ఈశ్వరరెడ్డి, పీపీఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలకు నిప్పు



కాలిపోయిన మిరపపంట, మంటలార్పేందుకు ప్రయత్నిస్తున్న రైతు

రాయచోటిటౌన్ : గుర్తు తెలియని ఆకతాయిల చేష్టలతో పొలాలకు నిప్పంటుకుంది. ఏపుగా పెరిగిన మామిడి, జామ, నేరుడు చెట్లు మంటల్లో కాలిపోయిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధిత రైతుల కథన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దిగువ అబ్బవరం గ్రామానికి చెందిన రామచంద్ర, వెంకటరమణలకు రాయచోటి రూరల్ పరిధిలోని శిబ్యాల గ్రామం మోడల్ స్కూల్ సమీపంలో పొలాలు ఉన్నాయి. ఇందులో మామిడి,మిరప, జామ, నేరేడు సాగు చేస్తున్నారు.వీరు ఆదివారం పొలానికి వెళ్లి చెట్లకు నీరు పారించి ఇంటికి వచ్చారు. మీ పొలాల్లో మంటలు వ్యాపించాయని స్థానికులు వారికి ఫోన్ ద్వారా తెలియజేశారు.హుటాహుటిన అక్కడికి వెళ్లి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు.సాధ్యం కాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేశారు.వారు అక్కడికి చేరుకునేలోపే కంచె, పంటపొలాలు కాలిపోయాయని బాధితులు వాపోతున్నారు.అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారని, పూర్తి స్థాయి నష్టం జరగకుండా ఆపగలిగారని రైతులు తెలిపారు.ఉన్నతాధికారులు స్పందించి ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

శివరాత్రి ఉత్సవాల్లో ఘర్షణ

- సీతంపల్లె యువకుల వీరంగం..!
- సర్పంచ్ వర్గీయులపై దాడికి యత్నం.. ఇరువర్గాలపై కేసు నమోదు



గాయపడిన సుబ్బారెడ్డి



అన్నసత్రం వద్ద సర్పంచ్ కిషోర్‌రెడ్డి వర్గీయులపై దాడికి ప్రయత్నిస్తున్న సీతంపల్లె వాసులు

చాపాడు: మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం వద్ద శనివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో సంగీత విభావరి కార్యక్రమం వద్ద ప్రొద్దుటూరు మండలంలోని సీతంపల్లెకు చెందిన యువకులు అసభ్యంగా ప్రవర్తిస్తూ వీరంగం సృష్టించారు. దీంతో గ్రామ సర్పంచ్ కిషోర్ కుమార్‌రెడ్డి, అల్లాడుపల్లె గ్రామస్తులు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తుండగా ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో సీతంపల్లెకు చెందిన ప్రదీప్ అనే యువకుడి తలకు గాయమైంది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రదీప్‌ను ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఘర్షణలో తమ గ్రామానికి చెందిన ప్రదీప్ గాయపడ్డాడని తెలుసుకున్న సీతంపల్లెకు చెందిన 40 మంది ఆదివారం మధ్యాహ్నం అల్లాడుపల్లెలోని వీరభద్రస్వామి అన్నసత్రం వద్ద సర్పంచ్ కిషోర్ కుమార్‌రెడ్డి, ఆయన అనుచరులపై దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో సుబ్బారెడ్డి(ఉదయ్) అనే యువకుడికి తీవ్ర గాయాలు కాగా, కిషోర్ కుమార్‌రెడ్డి, మరి కొంత మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై 30 మందికి పైగా ప్రదీప్ వర్గీయులపై, 10 మంది సర్పంచ్ వర్గీయులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కేసీ రాజు తెలిపారు.

అయ్యప్పధర్మాన్ని ప్రచారం చేయాలి



అయ్యపస్వామి క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న బాలాంజినేయులు, సమ్మెట శివప్రసాద్

నందలూరు(రాజంపేట): దేశ వ్యాప్తంగా అయ్యప్ప స్వామి ధర్మాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని అఖిలభారతీయ అయ్యప్ప ధర్మప్రచారసభ(ఏబీఏడీపీ) జాతీయ ప్రధానకార్యదర్శి ఏనుగుల బాలాంజినేయులు, జిల్లా అధ్యక్షుడు, నాగిరెడ్డిపల్లె మాజీ సర్పంచి సమ్మెట శివప్రసాద్‌లు పిలుపునిచ్చారు. ఆదివారం నందలూరులో జిల్లా కార్యవర్గసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్పధర్మప్రచారాన్ని నలుదిశలా వ్యాప్తి చేసేందుకు మండలస్థాయి కమిటీలను వేసినట్లు చెప్పారు. అనంతరం ఏబీఏడీపీ క్యాలెండర్‌ను విడుదల చేశారు. జీవితకాల సభ్యులకు ధ్రువీకరణ పత్రాన్ని, గుర్తింపు కార్డుని అందచేశారు. సమావేశంలో జిల్లా కోశాధికారి జయచంద్ర, సంయుక్తకార్యదర్శి తోట శివశంకర్, మండల అధ్యక్షుడు ముమ్మడిశెట్టి సుధాకర్, జిల్లా కార్యవర్గసభ్యులు మోహన్, మురళీ, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఏడేళ్లకే నూరేళ్లు నిండాయి

- నీటి సంపుగుంతలో పడి బాలుడి మృతి
- మూడు రోజుల కిందట ఘటన
- చిన్నచౌక్‌లో అదృశ్యం కేసు నమోదు
- 19న బాలుడి మృతదేహం గుర్తింపు



రఫీముద్దీన్ (ఫైల్)



సంపులోని నీటిలో తేలియాడుతున్న రఫీముద్దీన్ మృతదేహం

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వైఎస్ఆర్ కాలనీలో నీటి సంపు గుంతలోని నీళ్లలో పడి సయ్యద్ రఫీముద్దీన్ (7) అనే బాలుడు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన ఈనెల 16వ తేదీ సాయంత్రం జరిగింది.వివరాలు.. బాలుడి తండ్రి నజీరుద్దీన్ కడప నగరంలోని పెద్ద దర్గా సమీపంలో తోపుడు బండిపై పండ్లవ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. నజీరుద్దీన్‌కు, భార్య రజియా, సయ్యద్ ఫజులుద్దీన్ (11), సయ్యద్ అమీన (9), సయ్యద్ రఫీముద్దీన్ (7), సయ్యద్ అప్స(3) అనే పిల్లలు ఉన్నారు. తాము నివసిస్తున్న ప్రాంతంలో సహచర పిల్లలతో కలిసి సయ్యద్ రఫీముద్దీన్ సరదాగా ఆడుకుంటూ ఉండేవాడు. మృతుని తండ్రి నివసిస్తున్న ఇంటికి 200 మీటర్ల దూరంలోనే ఓ ఇంటి పునాది నిర్మాణంలోనే నీటిసంపు కోసం గుంత తవ్వి ఉంచారు. అందులో సగానికి పైగా నీరు నిల్వ ఉన్నాయి. ఇవేమీ తెలియని బాలుడు ఆడుకుంటూ వెళ్లి గుంతలో పడిపోయాడు.అయితే ఎవరూ గమనించలేదు. ఆ రోజు రాత్రి 7:30 గంటలైనా తమ కుమారుడు ఇంటికి రాకపోవడంతో నజీరుద్దీన్ భార్య రజియా భర్తకు సమాచారం తెలియజేసింది. నజీరుద్దీన్, తన స్నేహితులు, బంధువులతో కలిసి అన్ని చోట్లా వెతికారు. అంతకుముందు సాయంత్రం 6 గంటల సమయంలో తన కుమారుడు రఫీముద్దీన్, సహచర పిల్లలతో ఆడుకుంటూ ఉండటం చూసి పనిమీద కడప నగరంలోకి వెళ్లాడు.భార్య సమాచారంతో తిరిగి వచ్చి కుమారుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అదే రోజు రాత్రి చిన్నచౌక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు, మరుసటి రోజున ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం 10:30 గంటల ప్రాంతంలో చుట్టుపక్కల వారు సంఘటన స్థలంలో దుర్వాసన రావడంతో గుంతలో చూశారు.

రఫీముద్దీన్ మృతదేహం తేలియాడుతూ కనిపించింది. తల్లిదండ్రులు, బంధువులు, కన్నీరు, మున్నీరుగా విలపించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈనెల 16న ఆడుకుంటున్న సమయంలోనే గుంతలో పడి ఊపిరాడక చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పీలేరురూరల్ : విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన పీలేరు పట్టణంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. వెంకటప్పశెట్టి కుమారుడు యువరాజ్ (25) స్థానిక తిరుపతి రోడ్డులో కేవీపీ జనరల్‌స్టోర్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి తమ దుకాణం వద్ద నేమ్‌బోర్డు ఏర్పాటు చేసే క్రమంలో పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలాయి. విద్యుదాఘాతానికి గురైన యువరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. అతన్ని రక్షించబోయిన తల్లి పద్మావతి, స్నేహితుడు బాబు తీవ్రంగా గాయపడ్డారు.

కావ్య సాహిత్య ప్రతిష్టను పెంచిన 'భూతపురి'



ఆచార్య అనుమాండ్ల భూమయ్యకు పురస్కారం అందజేస్తున్న అతిథులు

- వైవీయూ వీసీ ఆచార్య రంగ జనార్ధన

కడప కల్చరల్ : మహాకవి, అవధాని డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ తన రచనలతో కావ్య సాహిత్య ప్రతిష్టను పెంచారని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.రంగజనార్ధన పేర్కొన్నారు. డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ మెమోరియల్ ట్రస్టు, అల్లసాని పెద్దన సాహిత్యపీఠం సంయుక్తంగా ఆదివారం స్థానిక బ్రౌన్ పరిశోధన కేంద్రంలో నిర్వహించిన డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ 86వ జయంతి, 21వ స్మారక పురస్కార ప్రదాన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత భూతపురి సోదరులు కవి పండితులతో కలిసి డాక్టర్ భూతపురి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భూతపురి కుమారుడు డాక్టర్ గోపాలకృష్ణశాస్త్రి సభకు వార్షిక నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ డాక్టర్ సుబ్రమణ్యశర్మ చేసిన రచనల్లో ప్రత్యేకించి కృష్ణభారతం ఆయనకు ఎనలేని పేరు ప్రఖ్యాతులు సంతరించి పెట్టిందన్నారు. కావ్య సాహిత్యానికి గౌరవం మరింతగా పెంచిందని తెలిపారు. అనుమాండ్ల భూమయ్య డాక్టర్ సుబ్రమణ్యం పురస్కారానికి అన్ని విధాలా తగిన వారన్నారు. విశిష్ట అతిథి, వైవీయూ కుల సచివులు ఆచార్య వైవీ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ 21 సంవత్సరాలుగా తండ్రి పేరిట పురస్కారాలు అందజేస్తూ అటు కావ్యాలకు, ఇటు రచయితలకు గౌరవం కల్పిస్తున్న భూతపురి సోదరులు అభినందనీయులన్నారు. ఇకపై ఈ కార్యక్రమానికి యోగి వేమన విశ్వవిద్యాలయం కూడా సహకారం అందిస్తుందని వీసీ అనుమతితో తెలుపుతున్నామన్నారు. సభాధ్యక్షులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ మాట్లాడుతూ సాహిత్యానికి పుట్టినిల్లయిన ఈ జిల్లాలో కావ్య ప్రక్రియలో ఆధునిక విషయాలను కలిపి కావ్య రచన చేసిన ఘనత భూతపురి సుబ్రమణ్యశర్మదే నన్నారు. అవార్డు గ్రహీత అనుమాండ్ల భూమయ్య తన కావ్యాలలో సామాజిక చైతన్యంతోపాటు అర్ధ గాంభీర్యం కూడా ఉండేలా విభిన్నమైన అంశాలను పొందుపరిచారన్నారు. ప్రధాన వక్త డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి మాట్లాడుతూ ఆంధ్రాభ్యుదయం, శ్రీకృష్ణభారతం కావ్యాలు డాక్టర్ సుబ్రమణ్యంశర్మకు ఎంతో పేరు తెచ్చాయన్నారు. ఆత్మీయ అతిథి విద్వాన్ సమ్మెట శివ శంకర్, వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.ఈశ్వర్‌రెడ్డి మాట్లాడారు.

పురస్కార ప్రదానం : ఈ సందర్భంగా భూతపురి కుమారులు శివరామసురేంద్రశర్మ, గోపాలకృష్ణశాస్త్రి సోదరులు, కవి పండితులు ఆచార్య అనుమాండ్ల భూమయ్యను అతిథులతో కలిసి నగదు పురస్కారంతో సత్కరించి సన్మాన పత్రం అందజేశారు. అవార్డు గ్రహీత స్పందిస్తూ సుబ్రమణ్యశర్మ లాంటి మహాకవి పేరిట పురస్కారాన్ని పొందడం భాగ్యంగా భావిస్తున్నట్లు చెప్పారు.

మత సామరస్యం, సౌభ్రాతృత్వానికి ఇస్లాం పెద్ద పీట

మదనపల్లె సిటీ: మత సామరస్యం, సౌభ్రాతృత్వానికి ఇస్లాం పెద్ద పీట వేస్తోందని ముస్లిం ఉలేమాలు, ధార్మిక మత గురువులు మౌలానా అజ్మల్‌సాహెబ్, మౌలానా నూర్ అహ్మద్‌సాహెబ్, మౌలానా ముఫ్తి ముజాహిద్‌సాహెబ్, మౌలానా ముఫ్తి అస్లాంసాహెబ్, మౌలానా మౌల్వి అక్బర్ షరీఫ్ సాహెబ్‌లు పేర్కొన్నారు. మదనపల్లె పట్టణం కదిరిరోడ్డులోని టిప్పుసుల్తాన్ వక్ఫ్ మైదానంలో జరుగుతున్న దీనే ఇజ్తిమాలో (ఇస్లాం మత ధార్మిక సదస్సు) రెండవ రోజు ఆదివారం ఉలేమాలు, మతగురువులు ధార్మికోపన్యాసం చేశారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవమార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఆర్థిక స్థోమత కలిగిన ప్రతి ఒక్కరూ పేదలను ఆదుకోవాలని తద్వారా పేదరికం లేని సమాజం నిర్మించాలన్నారు. స్వార్థాన్ని వీడి సమాజహితం కోసం పాటుపడాలని కోరారు. మనం నివసించే నేలను, శ్వాసించే గాలిని ప్రేమించాలని దేశభక్తిని కలిగి ఉండాలన్నారు. ఇస్లాం శాంతిని ప్రభోదిస్తుందని ప్రతి ఒక్కరూ శాంతియుత సమాజ నిర్మాణానికి ముందడుగు వేయాలని సూచించారు. యువత సన్మార్గంలో నడవాలని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

ప్రత్యేక దువాకు లక్ష మందికిపైగా హాజరు

ఇజ్తిమా ముగింపు సందర్భంగా ఆదివారం ప్రత్యేక దువాకు ఉమ్మడి చిత్తూరు, వైఎస్సార్ కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలు, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి లక్ష మందికిపైగా ముస్లింలు హాజరయ్యారు. దువాతో ఇజ్తిమాను ముగించడం ఆనవాయితీగా వస్తోంది. చేతులు పైకెత్తి ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమై విశ్వశాంతి కోసం ప్రార్థించారు.

ముగిసిన రెండు రోజుల దీనే ఇజ్తిమా: శనివారం ప్రారంభమైన రెండు రోజుల ఇజ్తిమా ఆదివారం సాయంత్రం ముగిసింది. ముగింపు సందర్భంగా చేపట్టిన దువా ఇజ్తిమాకు ప్రత్యేకంగా నిలిచింది. ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా ఇజ్తిమా కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఇజ్తిమా సమన్వయకర్త అమీర్ మైలానీ, మసీవుల్లా, మతగురువులు నూర్, హఫీజుల్లా, ఖాసీంఖాన్, జామియా మసీదు మౌల్వీ జలాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. డీఎస్పీ కేశప్ప, టు టౌన్ సీఐ మురళీకృష్ణ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.



మదనపల్లెలో జరిగిన ఇజ్తిమాకు భారీ సంఖ్యలో హాజరైన ముస్లింలు

టెన్షన్ రేపిన గురుకుల విద్యార్థి అదృశ్యం



నవదీప్ (ఫైల్)

బి.కొత్తకోట : బి.కొత్తకోట సమీపంలోని జీఎంసీ బాలయోగి గురుకుల విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి నవదీప్ అదృశ్యమైన ఘటనటెన్షన్‌కు గురిచేసింది. విద్యార్థి ఆచూకీ ఆదివారం రాత్రి లభ్యం కావడంతో ఊపిరిపీల్చుకున్నారు. ములకలచెరువు మండలం నాయనచెరువుపల్లెకు చెందిన నవదీప్ గురుకుల విద్యాలయంలో చదువుకుటున్నాడు. శనివారం సాయంత్రం ఆటల సమయం అయ్యాక భోజన సమయానికి కనిపించకపోవడంతో ప్రిన్సిపాల్ నాగవేలు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. శివరాత్రి పండుగకు ఇంటికి వెళ్లి ఉంటాడని భావించారు. తల్లిదండ్రులు కూడా ఇంటికి వస్తే విద్యాలయానికి తీసుకొస్తామని ప్రిన్సిపాల్‌కు చెప్పారు. అయితే ఆదివారం కూడా ఆచూకీ లభ్యంకాకపోవడం, ఇంటికి వెళ్లకపోవడంతో ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నవదీప్ బంధువుల ఇళ్లకు వెళ్లి ఉంటాడని భావించి ఆచూకీ ప్రయత్నాల్లో భాగంగా రాత్రి ములకలచెరువు రైల్వేస్టేషన్‌లో గాలిస్తుండగా కనిపించాడు. తల్లిదండ్రులు నవదీప్‌ను ఇంటికి తీసుకెళ్లి ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఉత్కంఠ వీడింది. కాగా ఈనెల 2న ఇదే విద్యాలయానికి చెందిన 30 మంది విద్యార్థులు అదృశ్యమై కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే.